తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 వెల: 3 సంపుటి:3 సంచిక: 150

శనివారం 01, నవంబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥



మాజీ ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి, మాజీ కేంద్ర హోం శాఖ మంత్రి స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే ఆరు గ్యారెంటీలు అమలు

- జూబ్లీహిల్స్ తీర్పుతో కాంగ్రెస్‌కి బుద్ధి
- షేక్‌పేట రోడ్ షోలో కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్ 31(అక్షరగళం):
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చే తీర్పుతో కాంగ్రెస్‌కి బుద్ధి వస్తుందని, కాంగ్రెస్ పరాజయం తప్పదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు, ఘోరాలపై ఆగ్రహంగా ఉన్న ప్రజానీకం ఆ పార్టీని తిరస్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు అవుతాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేవలం ఓటమి మిగతా.. 2లో





## బీజేపీ-బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

- రంగా బిల్లా, బీఆర్ఎస్ నాయకులు వస్తే వాతలు పెట్టండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- మైత్రీవనంలో అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- వెంగళరావు నగర్ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):
రాజకీయాల్లో ఎత్తుపల్లాలు ఉంటాయి. అవకాశం వచ్చినప్పుడు మనతో ఉండే వారిని గెలిపించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుంది. బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్ అంటున్నారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన పేదలకు అండగా నిలిచిన నాయకుడు పి.జనార్దన్ రెడ్డి. ఆయన మరణించినప్పుడు ఆయన కుటుంబ సభ్యుడిని నిలిపితే, ప్రతిపక్ష బీజేపీ నాయకులు, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పోటీ లేకుండా ఏకగ్రీవానికి ఒప్పుకున్నారు.కానీ ఏకగ్రీవానికి ఏమాత్రం అంగీకరించనది బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ కాదా? నగరానికి గోదావరి నీరు తెచ్చిన ఘనత పీజేఆర్ ది.
కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచిన శ్రీగణేష్ ఏడాదిలోనే 4 వేల కోట్ల అభివృద్ధి చేశారు. గత పదేళ్లు మున్సిపల్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నది బీఆర్ఎస్ నాయకులు ఏం చేశారు? ఇక్కడ అభివృద్ధిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు. బీజేపీ- బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం. బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీ ని గెలిపించారు. ఏనాడైనా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ ఇక్కడకు వచ్చారా? కార్పెట్ బాంబింగ్ చేస్తామని బీజేపీ నాయకులు అనడం సిగ్గుచేటు. పదేళ్లలో సన్న బియ్యం ఇచ్చా రా? బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇచ్చారా? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తే ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. బీఆర్ఎస్ కు ఓటు వేస్తే కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం రద్దు అవుతుంది. ఓట్లు అడగడానికి రంగా బిల్లా, బీఆర్ఎస్ నాయకులు వస్తే వాతలు పెట్టండి. మూడుసార్లు గెలిచిన నాయకుడు ఏ రోజైనా అసెంబ్లీలో మాట్లాడాడా?నవీన్ యాదవ్ గెలిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుంది. మిగతా.. 2లో

## వాళ్లను స్తంభానికి కట్టేసి అడగండి

- మీకు ఒక సిపాయి మీకు కావాలా? వద్దా?
- సీఎం రేవంత్ రెడ్డి ఎల్లారెడ్డిగూడ కార్నర్ మీటింగ్

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):
సాయంత్రం ఆరు గంటల నుంచి ఆడ బిడ్డలు పలికే స్వాగతం చూస్తుంటే నవీన్ యాదవ్ గెలుపు ఖాయమైంది..మెజారిటీనే లెక్క. ఏనాడైనా మీ ప్రాంతానికి రంగా బిల్లా లైన బావబావమరుదులు వచ్చారా? ఇప్పుడు వచ్చి ఆటోలు ఎక్కి తిరుగుతున్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది. మిగతా.. 2లో

## మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం



- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్
- సిఎం రేవంత్, మంత్రులు తదితరుల హాజరు

హైదరాబాద్,అక్టోబర్31 (అక్షర గళం):
తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజర య్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. మిగతా.. 2లో



## ఎకరా పంట నష్టానికి 10వేలు చెల్లింపు

- అధికారుల్లో సమన్వయ లోపం
- వరంగల్ వరదల్లో స్పష్టంగా కనిపించింది
- ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- మొంథా తుఫాన్‌తో 12జిల్లాల్లో ప్రభావం
- పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు
- మృతి చెందిన వారికి 5 లక్షల పరిహారం
- ఇసుక మేటలు తొలగించేందుకు ప్రణాళికలు
- వరంగల్ వరద ప్రాంతాల్లో సిఎం ఏరియల్ సర్వే
- కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష

హనుమకొండ,అక్టోబర్31(అక్షర గళం):
'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజా ప్రతినిధుల వద్దకు వచ్చిన మిగతా.. 2లో

## ఏ శాఖ ఇచ్చినా సంతోషమే

- మంత్రి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు
- తనపై ఆరోపణలు ఏవీ రుజువు కాలేదు
- కిషన్ రెడ్డికి నా గురించి సరిగా తెలియదు
- మీడియాతో మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):



మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని అజారుద్దీన్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మీడియాతో అజారుద్దీన్ మాట్లాడారు. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు తనపై చేస్తున్న విమర్శలపై స్పందించారు. నాపై వచ్చినవన్నీ ఆరోపణలు మాత్రమే. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతల విమర్శలు సరైనవి కావు. నా గురించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మిగతా.. 2లో



## సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

- ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు
- కేబినేట్ మీటింగ్‌కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):
సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత మిగతా.. 2లో



## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- రూ.1,031 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల
- నిధుల విడుదల చేస్తూ డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం): తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలతోపాటు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అక్టోబర్ నెల పెండింగ్ బిల్లులు సుమారు రూ.1,031 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఏకకాలంలో నిధులను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా.. 2లో




## రక్షణ, అంతరిక్ష రంగాల్లో మహిళల దూకుడు

- అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,అక్టోబర్31(అక్షర గళం):
దేశంలో రక్షణ, అంతరిక్ష, వ్యవసాయ రంగాలతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం విస్తరిస్తుండటం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీప్రశంసించారు. శుక్రవారం నాడు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్-2025 ను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ యుద్ధ విమానాన్ని నడిపిన స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్ పేరును ప్రత్యేకించి ప్రస్తావించారు. 'ఇవాళ మన ఆడకూతుళ్లు యుద్ధ విమానాలు నడుపుతున్నారు' అని హర్షం మిగతా.. 2లో

## చరిత్ర సృష్టిద్దాం రండి

- పటేల్ భారత్ చరిత్ర సృష్టించారు
- జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ

గాంధీనగర్,అక్టోబర్31(అక్షర గళం):ధ
చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారని, అందుకే ఆయన దేశాన్ని ఏకం చేశారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని మోడీ కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి మిగతా.. 2లో



## ఏడాదిపాటు పటేల్ జయంతి ఉత్సవాలు

- కాంగ్రెస్‌కు నెహ్రూ ఒక్కరే నేత
- ఇతర నేతలను పట్టించుకోని పార్టీ
- యూనిటీ రన్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):
ఏడాది పాటుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉత్సవాలు జరుపుతామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పటేల్ రాజకీయ నేత కాదు రైతాంగ ఉద్యమ నేత అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన యూనిటీ రన్‌లో వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. సర్దార్ పటేల్ అంటే కాంగ్రెస్ పార్టికి నొప్పి అని.. పీవీ నరసింహారావు అంటే కాంగ్రెస్‌కు నచ్చదంటూ వ్యాఖ్యలు చేశారు. కేవలం నెహ్రూ కుటుంబమే కాంగ్రెస్‌కు నచ్చుతుందన్నారు. కాంగ్రెస్‌కు దేశమంటే నెహ్రూ, నెహ్రూ అంటే దేశమని.. నెహ్రూ తప్ప కాంగ్రెస్‌కు ఎవ్వరూ అవసరం లేదని విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు. పటేల్‌ను వెన్నుపోటు పొడిచిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ ఆరోపించారు. పటేల్‌ను తెలంగాణ బిడ్డలు మిగతా.. 2లో

# కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే ఆరు గ్యారెంటీలు అమలు

(మొదటి పేజీ తరువాయి)

భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఆపదమొక్కులకు పోతున్నదని, అందుకే ఇన్ని రోజులు గుర్తుకురాని మైనార్టీల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, సినీ కార్మికుల దాకా అందరికీ ఏదో చేస్తామని మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు.రెండేళ్లలో ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నారో చెప్పాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

'ఇక్కడ 4 లక్షల మంది కాంగ్రెస్‌కు బుద్ధి చెబితే 4 కోట్ల మంది ప్రజలకు మేలు జరుగుతుంది' అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చిత్తు చిత్తుగా ఓడిపోతేనే హామీలన్నీ అమలవుతాయని చెప్పారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే, 'నేనేం చేయకపోయినా వీళ్లు మళ్లీ నాకే ఓటేస్తారని రేవంత్ రెడ్డి అనుకుంటారు' అని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు అమాయకులని, పైసలు ఇస్తే ఓట్లేస్తారని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని అన్నారు.

కాంగ్రెస్ వాళ్లు వచ్చి పైసలు ఇస్తే తీసుకోమని, కానీ ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'రూ. 5 వేలు ఇస్తే తీసుకొని.. మరి మిగితా బాకీ డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించాలి' అని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలంటే, జైత్రయాత్ర ఇక్కడి నుంచే



ప్రారంభం కావాలని కేటీఆర్ కోరారు.

కేటీఆర్ షేక్‌పేటలో రోడ్ షోలో పాల్గొని, జూబ్లీహిల్స్‌లో పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జూబ్లీహిల్స్ మళ్లీ కొడుతున్నాం', 'ఇక్కడ గెలుపు పక్కా.. కానీ మెజార్టీ ఎంతో తేలాల్సి ఉంది' అని విశ్వాసం వ్యక్తం చేశారు.

కేటీఆర్ మాట్లాడుతూ.... రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరికీ మేలు జరగలేదని, అరచేతిలో స్వర్గం చూపిస్తూ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలైన వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్, యువతులకు రూ. 2500, ఆడబిడ్డలకు స్కూటీ వంటివి అమలు కాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఉచితంగా ఇచ్చిన 20 వేల లీటర్ల ఫ్రీ వాటర్ కూడా ఇవ్వలేని సత్తా ఈ ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. పేదలకు పథకాలు ఇచ్చే తెలివి లేదని, కేసీఆర్ పథకాలను కంటిన్యూ చేసే తెలివి కూడా లేదని ఎద్దేవా చేశారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ వంటివి కూడా ఇప్పుడు ప్రజలకు అందట్లేదని అన్నారు. రెండేళ్లలో ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నారో అర్థం కావడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

గత 2023 ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని, జూబ్లీహిల్స్‌లో కూడా మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారని గుర్తుచేసి, ప్రస్తుతం దురదృష్టవశాత్తూ కన్నుమూసిన గోపీనాథ్ గారి సతీమణి మాగంటి సునీతను ఆశీర్వదించాలని కోరారు.

# ఏ శాఖ ఇచ్చినా సంతోషమే

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిస్థాయి అవగాహన లేదు. నాపై ఉన్న ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. మంత్రిగా నాకు అవకాశం కల్పించారు.. నాకు ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని అజారుద్దీన్ అన్నారు.తెలంగాణ మంత్రిగా కాంగ్రెస్ నేత అజారుద్దీన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు అజారుద్దీన్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరయ్యారు. మంత్రివర్గంలో అజారుద్దీన్ చేరికతో తెలంగాణ కేబినెట్ మంత్రుల సంఖ్య 16కి చేరింది. అయినా తెలంగాణ కేబినెట్‌లో ఇంకా 2 బెర్తులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే..

ఈ సందర్భంగా నూతన మంత్రి అజారుద్దీన్‌కి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మంత్రివర్గంలోకి ఆహ్వానం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. తన మంత్రి పదవికి, జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముడి పెట్టొద్దని పేర్కొన్నారు. రెండింటినీ వేర్వురుగా చూడాలని కోరారు. తానేంటో ప్రజలందరికీ తెలుసని ధీమా వ్యక్తం చేశారు.

తనకు ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తానని అజారుద్దీన్ స్పష్టం చేశారు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే.. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో స్థానం కల్పించింది.

# ఎకరా పంట నష్టానికి 10వేలు చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుంద న్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విష యంలో అలసత్వం ప్రదర్శించ వద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడ బోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీ లించారు.



అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టంఅంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని




శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు.

నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

సిఎం వెంట మంత్రి పొంగులేటి, మేయర్ గుండుసుధారాణి తదితరులు ఉన్నారు.

# ఏడాదిపాటు పటేల్ జయంతి ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరూ మర్చిపోరని.. సర్దార్ చేసిన త్యాగమే తెలంగాణ అని చెప్పుకొచ్చారు. పటేల్ చొరవతోనే తెలంగాణలో మూడు రంగుల జెండా ఎగిరిందని కేంద్రమంత్రి తెలిపారు.నిజాం నిరంకుశత్వంపై ఉక్కు పాదం మోపిన ఘనుడు పటేల్ అని పేర్కొన్నారు. నిజాం మెడలు వంచి తెలంగాణ గడ్డ మీద మూడు రంగుల జెండా ఎగరవేశారన్నారు. ఈ ఏడాది అంతా పటేల్ 150 జయంతి ఉత్సవాలను తెలంగాణలో ప్రతి ఇంట్లో ఘనంగా జరుపుకోవాలని కోరారు.

ఆయన స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు పటేల్ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. సర్దార్ స్ఫూర్తితో ప్రధాని మోడీ అడుగులు వేస్తున్నారని.. వికసిత భారత్ లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఉక్కు సంకల్పంతో నిజాం మెడలు వంచిన ఘనుడు పటేల్ అని రాజ్యసభ సభ్యు లక్ష్మణ్ అన్నారు. దేశ ఐక్యత కోసం కృషి చేసిన ఉక్కు నేత పటేల్ అని కొనియాడారు. సర్దార్‌ను గౌరవించడానికి కూడా కొన్ని పార్టీలు ఇష్టపడటం లేదని విమర్శించారు.

యువతకు స్ఫూర్తిగా అతిపెద్ద పటేల్ విగ్రహాన్ని నిర్మించిన ఘనత మోడీది అని చెప్పుకొచ్చారు. దేశానికి పటేల్ స్ఫూర్తిగా కావాలని లక్ష్మణ్ ఆకాంక్షించారు. పటేల్ చరిత్రను కనుమరుగు చేశారని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. దేశ సమగ్రత కోసం పాటు పడిన వ్యక్తి పటేల్ అని అన్నారు. ఇవాళ స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే పటేల్ త్యాగఫలితమే అని తెలిపారు. నగరంలో అతిపెద్ద పటేల్ విగ్రహాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు.

# వాళ్లను స్తంభానికి కట్టేసి అడగండి

(మొదటి పేజీ తరువాయి)

మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చినందుకు ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. అయిదేళ్లు ఆడ బిడ్డలను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. మేము సీతక్క, సురేఖ అక్కలను మంత్రులను చేశాం. వాళ్లు సొంత ఆడ బిడ్డను బయటకు వెళ్లగొట్టారు. వాళ్లు దుర్మార్గులని వాళ్ల ఆడ బిడ్డే చెబుతోంది. మీరు ఏం చేశారని ఒకడు అడుగుతుండు.

70 వేల ఉద్యోగాలు ఇచ్చింది రేవంత్ రెడ్డి కాదా? సన్న బియ్యం ఇస్తోంది రేవంత్ రెడ్డి కాదా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. మీ సమస్యల పరిష్కారానికి ఒక సిపాయి మీకు కావాలా? వద్దా? సానుభూతి అంటున్నారు. ఆ మాట మాట్లాడేవారు. పీజేఆర్ ను గుర్తుకు తెచ్చుకోవాలి. నాడు పీజేఆర్ గుండెపోటుతో చనిపోతే ప్రతిపక్ష నేత చంద్రబాబు, బీజేపీ నాయకులు పోటీ పెట్టమంటే పోటీ పెట్టిన దుర్మార్గుడు కేసీఆర్. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, పదేళ్లు మంత్రిగా ఉన్న కేటీఆర్ ఏనాడైనా ఇక్కడకు వచ్చారా? నాడు బెంజ్ కార్లలో తిరిగి ఇప్పుడు రబ్బర్ చెప్పులతో ఆటోల్లో తిరుగుతున్నారు. ఇక్కడకు వస్తే పదేళ్లపాటుఏం చేశావని స్తంభానికి కట్టేసి అడగండి. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో శ్రీగణేష్‌ని గెలిపిస్తే 4 వేల కోట్ల అభివృద్ధి పనులు చెస్తున్నాడు. గతంలో మూడు సార్లు



గెలిచిన వ్యక్తి ఏనాడైనా అసెంబ్లీలో మాట్లాడాడా? నగరంలో నాకో సిపాయి కావాలి. మీ అభివృద్ధికి మీకో సిపాయి కావాలి. నవీన్ కి ఒక్క అవకాశం ఇవ్వండి. అజారుద్దీన్ ని గెలిపిస్తే మంత్రిని చేస్తా అని చెప్పా. గెలిపించకపోయినా మంత్రిని చేశా.

మీరు ఒక్కరికి ఓటు వేస్తే ఇద్దరు మీకోసం పని చేస్తారు. ఎన్టీఆర్ అభిమాని కాని తెలుగు వారు ఎవరైనా ఉంటారా? అన్న గారి విగ్రహాన్ని మైత్రీవనంలో పెడతాం. విగ్రహాన్ని నేనే ఆవిష్కరిస్తా. ఈ తెలుగు సినిమా ను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లిన సినీ కార్మికులు ఇక్కడ ఉన్నారు. ఇక్కడ 400 బూత్ ల్లో మీరే రేవంత్ రెడ్డి, నవీన్ యాదవ్ లై పని చేసి గెలిపించాలి.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ



చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

# సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీ కృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# చరిత్ర సృష్టిద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

వేడుకల్లో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు.స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శ నికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం అని అన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్ర వాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్ర వాదులకు తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం అని మోదీ పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.

# రక్షణ, అంతరిక్ష రంగాల్లో మహిళల దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. మహర్షి దయానంద్ సరస్వతి 200వ జయంతి, 150 ఏళ్లుగా ఆర్యసమాజ్ సేవలకు గుర్తింపుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి ఫెస్టివల్‌లో భాగంగా అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్-2025ను నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండ్రోజుల క్రితం భారత తొలి మహిళా రాఫెల్ పైలట్లలో ఒకరైన స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్‌తో కలిసి రాఫెల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఇవాళ మన మహిళలు యుద్ధ విమానాలు నడుపుతున్నారు. డ్రోన్ దీదీలుగా మారి అధునాతన వ్యవసాయాన్నీ ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా స్టెమ్ గ్రాడ్యుయేట్లు భారతదేశంలోనే ఉండటం మనకు గర్వంగా చెప్పుకోవచ్చు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లోనూ న్యాయకత్వ పాత్రను మహిళలు పోషిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. దేశంలో గత రెండేళ్లుగా నిరంతర మేథో యజ్ఞం జరుగుతోందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతేడాది దయానంద్ సరస్వతి జన్మస్థలమైన గుజరాత్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని, దానికి ముందు మహర్షి దయానంద్ సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఢిల్లీలోను తాను ప్రారంభించానని చెప్పుకొచ్చారు. అదే ఈవెంట్‌లో రెండేళ్ల పాటు ఈ మహా యజ్ఞాన్ని కొనసాగించాలని నిర్ణయించామని చెప్పారు. సమాజానికి ఆర్యసమాజ్, స్వామి దయానంద సరస్వతి చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. దేశ వైదిక గుర్తింపు, పునరుత్తేజ స్ఫూర్తిని ఈ వేడుకలు ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను విడుదల చేశారు. రూ.10లక్షల లోపు పెండింగ్ బిల్లులను సైతం క్లియర్ చేయాలన్న సర్కార్ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు రిలీజ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లనూ అధికారులు రిలీజ్ చేశారు.

# బీజేపీ-బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

మాటిస్తే తప్పేది లేదు. మడమ తిప్పేది లేదు. మీరు ఒక్క ఓటు వేస్తే నవీన్ యాదవ్ ఎమ్మెల్యే అవుతారు. ఇప్పటికే అజారుద్దీన్ మంత్రి అయ్యారు. వాళ్ళిద్దరు అభివృద్ధి చేస్తారు. ఇక్కడ నవీన్ యాదవ్ ని గెలిపిస్తే అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటా. ఇక్కడ వర్షం, వరదలు వస్తే ముఖ్యమంత్రి హోదాలో నేను వచ్చి సమస్యలు పరిష్కరించా. పదేళ్లు మంత్రిగా ఉన్న వ్యక్తి ఏనాడైనా ఇక్కడకు వచ్చాడా గంజాయి, డ్రగ్స్‌పై పోరాడుతుంటే అడ్డుకుంటున్నారు. మైత్రీవనంలో అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. నవీన్ యాదవ్‌ని భారీ మెజారిటీతో గెలిపించండి.

తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



## తెలంగాణ రౌండప్

## కాంగ్రెస్ గెలుపు ఖాయం



**కుత్బుల్లాపూర్,అక్షరగళం:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శుక్రవారం ఉప ఎన్నికలలో భాగంగా ఏఐసీసీ ఇంచార్జ్ సెక్రెటరీ శ్రీ విశ్వనాథన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ ప్రధాన సహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ గార్లతో కలిసి ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలలో షేక్ పేట్ డివిజన్ ఇంచార్జ్ లు మరియు పార్టీ ముఖ్యనాయకులు మహమ్మద్ ఫహీం, మెట్టు సాయికుమార్, నీలం మధు, పూజల హరికృష్ణ గార్లతో కలిసి ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని పార్టీ అభ్యర్థి గెలుపు మార్గాలపై చర్చించారు.




## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

### - మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని ఆమనగల్లు మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ పేర్కొన్నారు. ఎంపీఓ వినోద పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జగన్ హాజరై మాట్లాడారు.. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, తన పదవీ కాలంలో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. శేష జీవితం ఆనందంగా గడపాలని తెలిపారు. అనంతరం ఎంపీఓ వినోద ను ఎంపీడీవో కుసుమ మాధురి తో కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి, కంప్యూటర్ ఆపరేటర్ కవిత, పంచాయతీ సెక్రటరీలు రాజు, జగన్, దేవేందర్, ఇందిర, జంగయ్య, రాజు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ విస్తృత ప్రచారం

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టారు. శుక్రవారం యూసుఫ్ గూడా లోని పలు కాలనీలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శతాబ్ది టౌన్ షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ పోతిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం ఇంటింటి ప్రచారం నిర్వహించి



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ కు ఓటు వేసి అభివృద్ధిని మరింత పటిష్టం చేయాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. నవీన్ యాదవ్ సేవా దృక్పథంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద ఉన్నా అన్ని వేళలా ఆదుకుంటూ ఉంటున్న వ్యక్తిగా గుర్తింపు పొందారని, కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, తలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి, రబ్బాని, ప్రసాద్, రఘుపతి తదితరులు ఉన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### - పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు. గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అనే నినాదంతో నవంబర్ 12న టిఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో చేపట్టుతున్న సంబంధించిన కరపత్రాలు నిర్వాహకులతో కలిసి శుక్రవారం పాపిశెట్టి రాము విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు యువత తాము అనుకున్న లక్ష్యాల వైపు ప్రయాణించి గమ్యం చేరుకోవాలని కానీ కొంతమంది యువకులు విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలుగా మారి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న టిఎస్ఎస్ఓ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థులు యువత రావాలని ఆయన పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభు శంకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మకొండ రాజు, టిఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ మీసాల చిక్కి( బాలవర్షిత్), నాయకులు వస్పుల సురేష్, మీసాల గోపాల్, వస్పుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో మరోమారు చిరుత కలకలం

### అప్రమత్తంగా ఉండాలని టిటిడి అధికారుల హెచ్చరిక

**తిరుమల:** తిరుమలలో మరోమారు చిరుత కలకలం రేపింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని టిటిడి అధికారుల హెచ్చరిక చేశారు. తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. శ్రీనివాసమంగాపురం నుంచి తిరుమలకు వెళ్లే మార్గంలో ఇది కనిపించింది. 150వ మెట్టు వద్ద రోడ్డు దాటుతున్న చిరుతను చూసి భక్తులు కేకలు వేశారు. సులభ్ కార్మికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. చిరుత సంచారం ఉన్నట్లు నిర్ధారించారు. భద్రతా చర్యల్లో భాగంగా 800వ మెట్టు వద్ద, శ్రీవారి మెట్టు ప్రారంభ ప్రాంతంలో భక్తులను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం భక్తులను 100-150 మందిని గుంపులుగా మాత్రమే అనుమతిస్తున్నారు. అటవీ అధికారులు చిరుతను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.





## జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కార్పోరేటర్ మాధరవం రోజా ప్రచారం

**కూకట్‌పల్లి,అక్షరగళం:**
వివేకానంద డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మాధవరం రోజా రంగారావు దంపతులు జూబ్లిహిల్స్ ఎన్నికలలో జోరుగా ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వినూత్నంగా ప్రచారం చేపట్టింది. "మాట - ముచ్చట" అనే కార్యక్రమం ద్వారా ఓటర్లకు మరింత చేరువయ్యేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఎర్రగడ్డలో మాట ముచ్చట అనే వినూత్న కార్యక్రమం ద్వారా ఓటరుకు చేరువయ్యే కార్యక్రమంలో ఓటర్లతో మాట్లాడుతూ ప్రచారం నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ జె.కే పాయింట్ హొటల్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి గారు, మూసా పేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ మరియు వివేకానంద నగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు టీ తాగుతూ అక్కడే ఉన్న ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరిస్తూ, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మాగంటి సునీతా గోపీనాథ్ కారు గుర్తుకు ఓటు ఎందుకు వేయాలో కూలంకషంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలను గుర్తు చేస్తూ బిఆర్ఎస్ పార్టీ గత ప్రభుత్వంలో చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

## జూబ్లీహీల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తధ్యం

### - టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):**
జూబ్లీహీల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తధ్యమని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని నవంబర్ 11న జరిగే ఉపఎన్నికల భాగంగా యూసఫ్ కూడా డివిజన్ పరిధిలోని వెంకటగిరి 226 బూత్ మసీద్ దగ్గర పలు ప్రాంతంలో ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్ పార్టీ వలె అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తు పైన ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి



నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. నవీన్ యాదవ్ ప్రజల ఆశయాలను నేరవేరుస్తారని, జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతాడని, సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి వర్గానికి న్యాయం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్, మాజీ వాయిస్ చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, సినియర్ నాయకులు బిఖ్య నాయక్, పత్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధనుష్ డాన్స్ స్టూడియో నూతన ప్రారంభం

### - ఉమాశంకర్ డాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో నృత్య సాంస్కృతిక వేడుక

**కూకట్‌పల్లి, అక్టోబర్31 (అక్షర గళం):** కూకట్‌పల్లి ప్రాంతంలోని చిత్తరమ్మ దేవి ఆలయం సమీపంలో ధనుష్ డాన్స్ స్టూడియో (డీడీఎస్) కొత్తగా ప్రారంభమైంది. ప్రముఖ డాన్స్ మాస్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఈ స్టూడియో ప్రారంభోత్సవం గురువారం సాయంత్రం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు, ప్రముఖ నటుడు ప్రసునూరి శ్రీనివాసులు హాజరై స్టూడియోను ప్రారంభించారు. ప్రత్యేక అతిథులుగా సినీ దర్శకులు కే.మోహన్, నటులు పవిత్ర, జ్యోతి స్వరూప, జబర్దస్త్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### - ప్రతిభకు వేదికగా డీడీఎస్

డీడీఎస్‌లో వెస్ట్రన్, జుంబా, ఫోక్, హిప్-హాప్, ఫ్రీ స్టైల్, దండియా, క్లాసికల్ నృత్యాలు ప్రత్యేకతగా బోధించబడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కొత్త తరం ప్రతిభావంతులైన డాన్సర్లకు ఈ స్టూడియో వేదికగా నిలుస్తుందని, నృత్యంలో కెరీర్ కొనసాగించాలనుకునే వారికి ఇది ఉత్తమ అవకాశమని ఉమాశంకర్ పేర్కొన్నారు.

### - సాంస్కృతిక రంగానికి ప్రోత్సాహం అవసరం

కార్యక్రమంలో మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు,



"నృత్యం యువతలో సృజనాత్మకతను పెంచుతుంది. ధనుష్ డాన్స్ స్టూడియో వంటి వేదికలు యువ ప్రతిభను వెలికి తేవడంలో కీలకం అవుతాయి" అన్నారు.

చివరగా పాల్గొన్న అతిథులు ఉమాశంకర్, ఆయన బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. స్టూడియో ప్రారంభోత్సవ వేడుకలో విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు.

## కార్మిక రాజ్యం ఎర్ర జెండాతోనే సాధ్యం

### - ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం.

### - ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ద

**కుత్బుల్లాపూర్,అక్షరగళం:**
ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ వార్డు కార్యక్రమం వద్ద అలాగే నిజాంపేట్ డంపింగ్ యార్డ్ దగ్గర ఆశి యాదయ్య ఆధ్వర్యంలో ఏఐటీ యూసీ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ హాజరైన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఏర్పడి 106వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నాము అని, ఎంతో మంది త్యాగల, అమరుల వల్ల ఈ కార్మికుల చట్టాలు, హక్కులు అనుభవిస్తున్నాము అని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హక్కులు కాపాడుకునే పరిస్థితి వచ్చింది. కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక చట్టాలు మార్చింది. తరువాత రైతు చట్టాలు మార్చింది. ఇప్పుడు వల్ల ప్రియమైన స్నేహితులకు ఆధాని కి ఎల్ఐసీ నుండి రెండు లక్షలా రూపాయలు అప్పనంగా ఇస్తున్నాడు. అని వార్తలో వస్తున్నాయి. కనుక మన కార్మిక రాజ్యం సాధించాలనంటే కేవలం మన ఎర్ర జెండా ఏఐటీయూసీ తోనే సాధ్యం. కనుక కార్మిక రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు



పాటుపడాలి అని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, పొన్నికంటి దస్తగిరి, మోహన్ రెడ్డి, పరమేష్ గౌడ్, తిమన్న, సాయి, కృష్ణ, రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

**వెల్దండ, అక్టోబర్ 31 (అక్షర గళం):**
వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఎర్ర శ్రీను ఎండి రషీద్ సాయి రెడ్డి మహేందర్ రెడ్డి చెన్నయ్య గోపాల్ చందు నాయక్ భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# అఖిల్ జన్మదిన వేడుకలు

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటి పలు సేవా కార్యక్రమాలు**

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా కుమారుడు డాక్టర్ అఖిల్ గుప్తా జన్మదిన వేడుకలను కడ్తాల్ మండల కేంద్రంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల అఖిల్ కేకును కట్ చేసి అభిమానులకు నాయకులకు పంచిపెట్టారు. అనంతరం రోగులకు పాలు పండ్లు పంచిపెట్టారు. అనంతరం తులసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా, లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ.. తులసి మొక్క వలె అఖిల్ ఎంతో ఎత్తుకు ఎదిగి ముఖ్యంగా బీద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. తన తండ్రి ఉప్పల వెంకటేష్ గుప్త బాటలోని పయనించి పుట్టిన గ్రామానికి కల్వకుర్తి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బి. రామకృష్ణ గుప్తా, వీరేంద్ర గుప్తా, పసుపుల వీరేష్ గుప్తా, గుద్దేటి సాయి గుప్తా, కడ్తాల్ మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, బి ఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్షాద్, నాయకులు కొప్పు కృష్ణ, సిద్ధిగారి సురేష్, పోతుగల్ల మహేష్, కొప్పు శ్రీకాంత్, సిద్ధిగారి వెంకటేష్, అంజి, దాస్, బుచ్చిబాబు, వీరు, అమృతం పాండు, భరత్, వంశీ, ఒగ్గు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ స్ఫూర్తితో పాలన

**- మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్**

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గరీబీ హటావో.. దేశ్ కో బచావో నినాదంతో పేదలకు సంక్షేమాన్ని దగ్గరకు చేశారని ఆమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ కొనియాడారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మండల అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని కొనియాడారు. ఇందిరా గాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని, పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. మన దేశంలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని అన్నారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకులు అబ్దుల్ ఖాదర్, ఖాదర్ ఖాద్రి, గాజుల సురేష్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ అలీమ్, శేఖర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, సురేష్ నాయక్, ఎన్ఎస్ ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కాలే మల్లయ్య, కుమార్ గౌడ్, నాజర్, పత్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.






# 'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం'

**ఆమనగల్లు, అక్టోబర్ 31 (అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దారెడ్డి అంజన్ రెడ్డి, పెరుమాండ్ల వెంకట్ రెడ్డి, డోకూరి ప్రభాకర్ రెడ్డి, జగన్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలంటూ బోరబండ పోలింగ్ బూత్ 228 ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. నవీన్ యాదవ్ ప్రజల ఆశయాలను నేరవేరుస్తారని, జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతాడని, సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి వర్గానికి న్యాయం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# సర్దార్ పటేల్ గారి సేవలు చిరస్మరణీయం

**- మాధవరం కాంతారావు**

**కూకట్‌పల్లి,అక్షరగళం:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగా భారతదేశ హోంశాఖ మంత్రిగా, ఉపప్రధానిగా సేవలందించిన ఉక్కు మనిషి శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 150వ జయంతి వేడుకలు శుక్రవారం కూకట్పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి– కూకట్పల్లి స్వఛభారత్ వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ నీయులు శ్రీ మాధవరం కాంతారావు రావు హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం చెల్లాచెదురైన రాష్ట్రాలన్నింటినీ ఒకే దేశంగా తీసుకురావడానికి ఉక్కు మనిషి పటేల్ గారు ఎంతగానో కృషి చేశారన్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా ప్రకటించారనీ.. నరేంద్ర మోదీ గారు గుజరాత్ రాష్ట్రంలో 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పటేల్ గారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ప్రస్తుతం సుందర పర్యాటక ప్రదేశంగా ఆ ప్రాంతం ఎంతోమంది చిరు వ్యాపారులకు ఉపాధిగా మారిందన్నారు. భారత దేశానికి పటేల్ గారి సేవలు చిరస్మరణీయం, ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ సంవత్సరాలుగా కూకట్పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశపౌరంలందరికీ ఈ సందర్భంగా కాంతారావు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మయ్య. వంశిరెడ్డి, సుధా రవి, వినోద్ గౌడ్, తోట రమేష్, చారి, వెంకట రమణ యాదవ్, ప్రేమ్, రేపల్లె రాజు, శిరీష, బాల నగర్ రమేష్,రామకృష్ణ మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.




### తెలంగాణలో సోలార్ విద్యుత్‌కు

# నైవేలీ పెట్టుబడులు

**10వేల కోట్లతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అంగీకారం**

**భూములు కేటాయించి సహకరించాలని ప్రభుత్వానికి సూచన**

**డిస్కమ్‌లను నష్టాల ఊబిలోకి నెడుతున్న తెలంగాణ ప్రభుత్వం**

**కెసిఆర్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం):** నైవేలీ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణలో రూ.10,000 కోట్ల పెట్టుబడులతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించి, ఈ పెట్టుబడులకు సహకరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ సంవత్సరానికి సగటున 9.8 శాతం పెరుగుతోంది. 2030 నాటికి రాష్ట్రానికి 33,773 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని చెప్పారు. అయితే, రాష్ట్రంలోని డిస్కంలు (విద్యుత్ పంపిణీ సంస్థలు), పవర్ ప్రొడక్షన్ యూనిట్లు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో కొనసాగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.30,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి రూ.42,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వం వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆమన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల ఉత్పత్తిలో 74 శాతం థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి అవుతోందని చెప్పారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రాల వద్ద 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం

కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లోనే సోలార్ పంప్ సెట్లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, గృహ అవసరాల కోసం లక్షలాది కుటుంబాలు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్ కు అనుసంధానం చేసుకుని, విక్రయించుకునే వీలు కలుగుతుందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కనీస మద్దతు ధరను భారీగా పెంచామని, యూరియా వంటి ఎరువుల ధరలు పెరిగినా కూడా సబ్సిడీ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 450 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు అనుమతి ఇచ్చామని, అలాగే 40 వేల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారని.. ఇందులో 20,000 యూనిట్లు మొదటి విడతలో ఇన్‌స్టాల్ చేస్తామని వివరించారు. రామగుండం ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను దశలవారీగా నిర్మిస్తు న్నామని తెలిపారు. మొదటి విడతలో రూ.12,000 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ప్రారంభించారని, రెండో విడతలో 3800 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొనసాగు తున్నాయని చెప్పారు. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 80 శాతం తెలంగాణకే కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మొత్తం విద్యుత్ కొనుగోలు చేయకుండా మూడో వంతు మాత్రమే తీసుకుంటోందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీపీసీ ఉత్పత్తి చేసిన మొత్తం విద్యుత్‌ను కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు పూర్తయ్యాయని, మరో 56 మెగావాట్ల సోలార్ ఎలాంట్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. రామగుండంలో 121 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్లుగా మైనారిటీలకు అన్యాయం చేసి, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల దృష్ట్యా ఓట్ల కోసం ఆ వర్గానికి చెందిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తున్నారని అన్నారు. అజారుద్దీన్‌పై, మైనారిటీలపై ప్రేమ ఉంటే రెండు సంవత్సరాల క్రితం ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదు? అని ప్రశ్నించారు.









# పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పదు

**మేడ్చల్ కలెక్టరేట్ ,అక్షరగళం:** పదవీ విరమణ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తప్పదని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిపిఆర్వో స్వర్ణలత అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార పౌర సంబంధాల శాఖ షేక్ రహ్మత్ అలీ(రికార్డ్ అసిస్టెంట్) పదవి విరమణ కార్యక్రమంలో డిపిఆర్వో స్వర్ణలత, డిప్యూటి ఇఐఈ నాగాంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాచార శాఖ వారు షేక్ రహమత్ అలీ సేవలను గుర్తు చేస్తూ వారి నిబద్ధత, నిస్వార్థత, విధుల పట్ల వారు నిర్వహించిన బాధ్యతలు శ్లాఘనీయం అన్నారు. అలాగే, వారి శేష జీవితం ఆరోగ్యంగా ప్రశాంతంగ సాగిపోవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. షేక్ రహమత్ అలీ గారు స్పందిస్తూ ఐ అడ్ పీర్ డిపార్ట్ మెంట్ లో అనేక జిల్లాలలో సేవలు చేసే అవకాశం అనేది అదృష్టంగా భావిస్తున్నానని, ఇందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, షేక్ రహమత్ అలీని పలువురు ఘనంగా సత్కరించి సన్మానించారు.

ఈ సందర్భంగా దేవత సుధాకర్ గజల్ ఆలాపన ఆకర్షించింది. ఇందులో డిపిఆర్ఓ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు, పాత్రికేయులు, షేక్ రహమత్ అలీ కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పాల్గొన్నారు.





# వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ఎకరాకు 50వేల పరిహారం ఇవ్వాలి**

**కల్వల మత్తడిని పరిశీలించిన కవిత**

**కరీంనగర్,అక్టోబర్31(అక్షర గళం):** తెలంగాణలో భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ. 70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన రూ. 70 కోట్ల జీవో ను పాస్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల బాగు కోసం మత్తడి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదు అనే మాటను నిజం చేయాలంటే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో కట్ట తెగినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి తొందరగా దీన్ని పూర్తి చేశారని.. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా మత్తడిని పునరుద్ధరించాలని కోరారు. మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, ఖమ్మం రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్నట్లుగా విన్నామని చెప్పారు. శంకరపట్నంలో కూడా వరి రైతులు నష్టపోయారని.. వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ. 10 వేలు కాకుండా ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు చేతికొచ్చిన పంటను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పుడు పంట కోసిన కూడా 25 శాతం వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రభుత్వం రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి అధికారులను ఫీల్డ్ కు పంపించి పంట నష్టం లెక్కలు తీయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం తరఫున రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పించాలని కోరారు. కల్వల మత్తడి రిపేర్ కోసం ముఖ్యమంత్రితో ఎంపీ మాట్లాడాలన్నారు. అటు ఈ ప్రాజెక్ట్ మీదనే దాదాపు 180 ముదిరాజ్ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని.. వారికి ఇదే జీవనాధారమని చెప్పారు. వెంటనే మత్తడి బాగు చేయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.





తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
శనివారం 01, నవంబర్ 2025

# మొంథా తుఫాన్ నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక

**- రూ.5,244 కోట్లు నష్టం - తక్షణ సాయానికి వినతి**

**- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలు పంపాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వం**



**అమరావతి:** మొంథా తుఫాన్ నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక నివేదికను పంపారు.

ఇప్పటివరకు ఉన్న అంచనాల ప్రకారం 17 శాఖలు, రంగాలకు సంబంధించి మొత్తం రూ.5,244 కోట్లు నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లింది. ప్రస్తుతం ప్రాథమిక అంచనాల ప్రకారమే నివేదిక సమర్పించామని, పూర్తి స్థాయిలో వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ప్రాథమిక నివేదికలో అంశాలవారీగా ఏయే శాఖలు, ఏయే రంగాల వారీగా ఎంతమేర నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలను పేర్కొంది. ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ ప్రభావాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు ప్రభుత్వం ఏ విధంగా తీసుకుందో వివరించింది. 19 జిల్లాలకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్టు తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉందని నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలోని 249 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్ట ణాలపై తుఫాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని స్పష్టం చేసింది. తుఫాన్ వల్ల సంభవించిన నష్టాన్ని శాస్త్రీయంగా మదింపు చేసినట్టు పేర్కొంది. ఈ మేరకు తుఫాన్ తీవ్రతను అద్దం పట్టేలా ఫోటోలను లేఖతో జతపరిచి... తుఫాన్ నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాలను పంపాల్సిందిగా కోరింది.

### దెబ్బతిన్న 4,794 కి.మీ. ఆర్ అండ్ బీ రహదారులు

అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం... అత్యధికంగా రహదారులు, వ్యవసాయం-అనుబంధ రంగాల్లో నష్టం సంభవించినట్టు పేర్కొన్నారు. తుఫాన్ వల్ల ముగ్గురు మరణించినట్టు వెల్లడించారు. 4,794 కి.మీ. మేర ఆర్ అండ్ బీ రహదారులు, 311 కల్వర్టులు-బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు.

ఈ నష్టం రూ.2,774 కోట్ల మేర ఉందని వివరించారు. 18 జిల్లాల్లోని 862 కి.మీ. మేర పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఈ శాఖకు రూ.454 కోట్ల నష్టం జరిగింది. 48 పట్టణ ప్రాంతాల్లోని రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులు విధ్వంసమయ్యాయి. వీటి పునరుద్ధరణకు రూ.109 కోట్లు వ్యయం కానుందని నివేదికలో చెప్పారు.

### 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం

వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్లలోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని... దీంతో రూ.829 కోట్ల వరకు రైతులు నష్టపోయినట్టు నివేదిక చెబుతోంది. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుఫాన్ ప్రభావం చూపించింది. 12,215 హెక్టార్లలోని రూ.40 కోట్ల విలువైన ఉద్యానపంటలు దెబ్బతినగా 23,979 మంది ఉద్యాన రైతులకు నష్టం జరిగింది. ఆక్వారంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. మరోవైపు 2,261 పశు సంపదను నష్టపోయారు.

### విరిగిపడ్డ 2,817 విద్యుత్ స్తంభాలు

రాష్ట్రంలోని 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 26,575 డీటీఆర్‌లు ధ్వంసమయ్యాయి. 429 కి.మీ. మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీని వల్ల విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల వరకు నష్టం జరిగింది. ఇక, రూ.234 కోట్ల మేర నష్టం నీటిపారుదల శాఖకు కలిగింది. అలాగే, 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమైనట్టు ప్రాథమిక నివేదికలో గుర్తించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ.122 కోట్ల నష్టం వాటిల్లింది. మరోవైపు, 1,464 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేయగా 1,36,907 మందికి పునరావాసం కల్పించారు. సహాయక చర్యల కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.32 కోట్లు ఖర్చు పెట్టినట్టు అధికారులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.




# విజిలెన్స్‌లో కృత్రిమ మేథా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి

**- హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్**

**- విజిలెన్స్ శిక్షించే వ్యవస్థగా కాదు**

**- సంస్కరించే వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి**

**- జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస రావు**

**- సింగరేణి విజిలెన్స్ వారోత్సవాల్లో ప్రముఖుల సందేశాలు**

**రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో సింగరేణి కార్యకలాపాలు: సీఎండీ ఎన్.బలరామ్**

**హైదరాబాద్:** అవినీతి అక్రమాలు, నేరాలను నియంత్రించే క్రమంలో విజిలెన్స్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేస్తే పారదర్శకత, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం ఉదయం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఐదో రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సమావేశానికి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ అధ్యక్షత వహించారు.

సజ్జనార్ మాట్లాడుతూ, "అవినీతి, అక్రమాలు తగ్గాలంటే వ్యవస్థల్లో మౌలిక మార్పులు అవసరం. లోపభూయిష్టమైన విధానాలు అక్రమాలకు దారితీస్తాయి. కాబట్టి వ్యవస్థను పటిష్టపరచి, మంచి అలవాట్లు, పద్ధతులను అమల్లోకి తేవాలి," అని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

సింగరేణి సంస్థతో తనకు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. నేడు దేశ జీడీపీ పెరుగుదలలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ యువ సీఎండీ ఎన్ బలరామ్ సారథ్యంలో పలు వ్యాపార విస్తరణ చర్యల ద్వారా గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ దిశగా మరింత వేగంగా ఎదగాలి అని ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. మార్పు స్వీకరించడంలో వెనుకబడ్డ అనేక కంపెనీలు మూతపడ్డాయని గుర్తుచేసి, సింగరేణి ఉద్యోగులు సవాళ్లను స్వీకరించి, తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. విజిలెన్స్ విభాగం ఇతర సంస్థల్లో అమలు చేస్తున్న మంచి పద్ధతులను స్వీకరించడం ద్వారా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి .శ్రీనివాసరావు మాట్లాడుతూ... నేటి ఆధునిక పరిస్థితుల్లో విజిలెన్స్ శాఖ అంటే శిక్షించే వ్యవస్థగా కాకుండా సంస్కరించే శాఖగా రూపు దిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి చేయాల్సిన ప్రతీ కార్యకలాపాన్ని స్థిరంగా మరియు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఎలా నిర్వహించాలో తెలిపే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్సు ను రూపొందించాలని సూచించారు. దీనివల్ల పొరపాట్లు జరగడానికి అవకాశం ఉండదని, అలాగే అవినీతిని నిరోధించవచ్చని పేర్కొన్నారు. విజిలెన్స్ శాఖ అవినీతి అక్రమాలను అడ్డుకునే క్రమంలో అత్యుత్సాహం తో నిజాయతీగా పనిచేసే అధికారులను మాత్రం భయపెట్టకూడదని అభిప్రాయపడ్డారు. దీనివల్ల విజిలెన్స్ యొక్క అసలు లక్ష్యం పక్కదారి పడుతుందన్నారు.

బాగా పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసలు అవసరమని, ఇవి వారు మరింత బాగా పనిచేయటానికి ఉపయోగపడతాయన్నారు. ఉద్యోగులకు తెలియకుండా పొరపాట్లు జరిగినప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించాలన్నారు. తాము పనిచేస్తున్న పనికి జీతం తప్ప వేరే ఇంకా ఏమీ ఆశించని స్థాయికి ఉద్యోగులు తమ ఆలోచనలు మార్చుకోవాలని, అప్పుడు విజిలెన్స్ శాఖ అవసరం ఉండదు అన్నారు. ప్రతి ఉద్యోగి ప్రశాంతంగా తమ బాధ్యతలు నిర్వహించాలని, ప్రలోభాలకు లోను కాకూడదని పేర్కొన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ తీసుకురావడం కోసం, పని గంటల సద్వినియోగం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నామని, వ్యవస్థలను మరింత పటిష్ట పరిచేందుకు ఈసారి విజిలెన్స్ వారోత్సవాలలో ప్రముఖులను ఆహ్వానించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించేలా, అలాగే అంతర్జాతీయంగా ఖనిజ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రైతులకు ఒక్క రూపాయి కూడా అందించలేదు

- **ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు?**
- **రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఇదేనా?**
- **బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ**



**హైదరాబాద్:** తెలంగాణలో భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయిన ఈ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వంపై చేసిన తప్పుడు ఆరోపణలను బిజెపి తీవ్రంగా ఖండిస్తోంది.

గతంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణలోని కరీంనగర్, వరంగల్ నగరాల అభివృద్ధి కోసం స్మార్ట్‌సిటీ కింద కోట్లాది రూపాయల నిధులను కేటాయించింది. అయితే ఆ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారిమళ్లించి నగరాల అభివృద్ధిని అడ్డుకుంది. ఇప్పుడు అదే పద్ధతిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది.

భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరం జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వినియోగించి ఉంటే, ఈరోజు వరంగల్ ఈ దుస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది కాదు. రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్య వైఖరే ఈరోజు వరంగల్ రోడ్లు, కాల్వలు, ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. 2024లో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు రూ.5,858 కోట్లు వరద సాయం (NDRF) నిధులుగా విడుదల చేసింది. వాటిలో తెలంగాణకు రూ.416.80 కోట్లు విడుదల చేసింది. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు ఒక్క రూపాయి కూడా అందించలేదు? ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు?

తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడ్లను ఆరబోసుకుంటూ మార్కెట్ యార్డుల్లో ఎదురుచూస్తున్నారు. పంటలు నష్టపోయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిహారం లభించలేదు. ప్రతి సారి పంట నష్టాలు సంభవించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం పేరుతో ప్రకటనలు చేయడం, తూతూ మంత్రంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం తప్పితే.. కార్యాచరణలో మాత్రం ఏమాత్రం నిజాయితీ లేదు.

రైతుల కన్నీళ్లు తుడవకుండా ప్రకటనలకే పరిమితమవుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఇదేనా? ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతుల పక్షాన బిజెపి పోరాటం ఉధృతం చేస్తుందని హెచ్చరిస్తున్నాం.


# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం..


**- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకెళ్తున్నాం**

**- 22 నెలల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి**

**- కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపు**


**హైదరాబాద్:** ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని, గడచిన 22 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడతాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బి ఆర్ ఎస్ తన పదేళ్ల





పాలనలో భవిష్యత్తులో కోలుకోలేనివిధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ఊహకు అందని రీతిలో విధ్వంసం సృష్టించింది. అయినా కూడా ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకుంటూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ 22 నెలల్లోనే తెలంగాణలోని ప్రతి పౌరుని హృదయాలలో ఒక స్థానాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం సంపాదించుకుంది. ఒక్క ఓటు ప్రజల జీవితాలను ఎలా మారుస్తుందని చెప్పడానికి ఈ 22 నెలల పాలననే నిదర్శనం. పదేళ్ల టి ఆర్ ఎస్ వైఫల్యాలు, అవినీతి అక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తూనే మరోవైపు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికి తిరిగి చేరవేయాలని సూచించారు. ఈ సమావేశంలో నకిరేకల్ , ఆలేరు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయిక్, రోడ్ సేఫ్టీ అథారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం

**- శ్రీ దక్షిణామూర్తి, గణపతి, శివలింగ, స్కందమాత, నందీశ్వర, నవగ్రహ దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన**

**- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి కరమకమాలచే ప్రతిష్ఠాపన**

**- హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి తలసాని, ఇంద్రకిరణ్‌రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్**

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లో అత్యంత పురాతన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ కార్యక్రమం భక్తుల జయజయధ్వానాల నడుమ ఘనంగా జరిగాయి. ఆరు దశాబ్దాల క్రితం.. నడిచేదేవుడు శ్రీ కంచి పరమాచార్య స్వహస్తాలతో ప్రతిష్ఠించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని, భక్తుల విరాళాలతో మరింత అభివృద్ధి పరిచేందుకు జీర్ణోద్ధరణకు రెన్యువేషన్ కమిటీ సంకల్పించింది.




ఆ ప్రకారం సుమారు 10 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన జీర్ణోద్ధరణ నిర్మాణ కార్యక్రమం.. చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ తమ్మన వేణుగోపాలరావు, సభ్యుల పర్యవేక్షణతో విజయవంతంగా పూర్తయింది. వీరి కృషి-దాతల చేయూత ఫలితంగా ఆలయ నిర్మాణం




త్వరగా పూర్తయింది. తమిళనాడు నుంచి వచ్చిన శిల్పులు తమ ప్రత్యేకత చాటుకున్నారు.

ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ దక్షిణామూర్తి, గణపతి, శివలింగ, స్కందమాత, నందీశ్వర, నవగ్రహ దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి కరకమలాలతో జరిగింది. ఈ కార్యక్రమాలకు శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహా సంస్థానం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, విజయవాడ శ్రీమద్ అష్టాక్షరీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి వేంచేసి, భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సనత్‌నగర్ ఎమ్మెల్యే-మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, సీనియర్ ఐఏఎస్ అనితా





రామచంద్రన్, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పోరేటర్లు సామల హేమ, కందిశైలజ, నగర బీజేపీ నేత రాచమల్లు కృష్ణమూర్తి, పద్మారావునగర్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కొడకండ్ల అపర్ణ రాజేష్‌కుమార్, కమిటీ సభ్యులు పెండ్యాల ఆత్మారామ సుబ్రహ్మణ్యం, చివుకుల బాల భాస్కర్, గోపాలకృష్ణన్ నారాయణన్, శివశంకరన్, కె.కె.లక్ష్మీనారాయణ, జెఆర్ ఉమేష్, డాక్టర్ సుజయ్ ప్రకాష్ రమణన్, మావూరి గాయత్రి స్వాగతం పలికారు.

# సంపాదకీయం..

## వరద సహాయక చర్యల్లో వైఫల్యం !

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అజారుద్దీన్‌కు మంత్రి పదవి..ఈ రెండే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నాయా అన్న అనుమానం కలుగుతోంది. మొంథా తుఫాన్‌తో రాష్ట్రం విలవిల్లాడినా, వరంగల్ నగరం మునిగి ప్రజలంతా నీటి పాలయినా ఎక్కడా సహాయక చర్యలు సక్రమంగా లేవు. రెండు రోజులపాటు, ఇల్లూ వాకిలి వదిలి వెళ్లిన ప్రజలు ఇంటికి వచ్చే వరకు సర్వం కొట్టుకు పోయింది. అయినా వారి ఇళ్లను శుభ్రం చేసు కోవాలంటే నీరు లేదు. తాగడానికి నీళ్లు లేవు. భోజనం సంతగి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఉన్నదంతా ఊడ్చుకుపోయినా వారిని ఆదుకునేందుకు ఎవ్వరూ కానరాలేదు. గోపాలపురం, భీమారం పరిధిలోని కాలనీ ప్రజల వ్యథ అంతాఇంతా కాదు. ఎపిలో సిఎం చంద్రబాబు, ఆయన మంత్రులు, అధికారులు నిముష నిముషానికి సమీక్షించి ప్రజలకు అండగా నిలిచారు. తుపాన్ తీరం దాటిన తెలవారే చంద్రబాబు బాధజత ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రులు పర్యటించారు. కానీ ఓరుగల్లులో అలాంటి పరిస్తితి కానరాలేదు. తెలంగాణలో మాత్రం అలాలేదు. మంత్రులు అందరూ జూబ్లీహిల్స్‌లో ఊరేగితే రాష్ట్రంలో పాలన పరిస్థితి, ప్రజల పరిస్థితి ఏంటని వరంగల్ ముంపు ప్రాంతాలను చూస్తే అర్థం అవుతుంది. మంత్రులు కోరుకుంటే హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే మాత్రం రావా అని ప్రజలే నిలదీస్తున్నారు. హనుమకొండ, జులైవాడలో భారీగా కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీలతో పాటు అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించేందుకు మంత్రులు ఎవ్వరూ రాకపోవడం వింతే. మొంథా వరద బీభత్సంతో



గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు నీటి మునిగి, నగరం జల దిగ్బంధం అయింది. నిత్యావసర వస్తువులు సహా, విలువైన టీవీ, బీరువాలు సైతం నీట మిగిని ఆస్తి నష్టం వాటిల్లింది. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీటమునిగిన ఇళ్లల్లోనే గడిపారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా గ్రహించి అంచనా వేయడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. తక్షణమే నీటి మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.సమ్మయ్య నగర్ పూర్తిగా నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ఆవులు, గేదెలు, పశువులు అరుస్తూ వరదల్లో కొట్టుకుపోవడం వాటి యజమానులను కలిచి వేసింది. ఆస్తి నష్టంతో పాటు పశు పక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా వాటిల్లే ప్రమాదం ఉంది. మొంథా తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినాముందస్తు చర్యలు తీసుకోవడంల ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమయంలో ఒక్క జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జీగా ఉండి.. వరద ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాలి. ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న వారితో సహా జిల్లాలకు చెందిన మంత్రులు కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. లోతట్టు ప్రాంతాల ప్రజల జీవనం కూడా దుర్భరంగా మారింది. శివనగర్, మైసయ్య నగర్, ఆర్ఎస్ నగర్, చింతల్ ప్రాంతాల్లోని అనేక కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. ముఖ్యంగా శివనగర్ మరియు మైసయ్య నగర్లలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ నీటిలో తడిచి ముద్దయ్యాయి. రాత్రంతా నిద్రలేని రాత్రులు గడిపి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. వరద బాధితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు శివనగర్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో బల్దియా పారిశుధ్య కార్మికులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లమీద, డ్రైనేజీ, నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

ఇకపోతే భారీ వర్షాలు, వరదలతో భీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ అన్నదాతల ఆశలపై పిడుగు పాటుగా మారింది. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. కేవలం పంటలే కాక, లోతట్టు ప్రాంతాల ప్రజల జీవితాలు కూడా వరదనీటిలో చిక్కుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్‌లోని విలీన గ్రామాల రైతులను తుఫాన్ నిండా ముంచింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తూ పూర్తిగా నేలకొరిగాయి. అలాగే, ఖిలా వరంగల్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వందల ఎకరాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల తోటలు ఏకంగా 6 అడుగుల నీటి కింద మునిగిపోయాయి. కోట ప్రాంతంలో రైతులు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. కళ్ల ముందు పంట నాశనం కావడంతో, వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంట వారం రోజుల్లో చేతికి వస్తది అనుకున్న అన్నదాతల ఆశ ఆడియాసలైంది. మొత్తం తుఫాన్‌కు ఆహుతి కావడంతో, ఆపదలో ఉన్న తమను ఆదుకోవాలని, కనీసం పెట్టుబడికైనా సాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే శుక్రవారం వరంగల్ పర్యటనకు సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారు. అయితే మంత్రులు ఇటుపై దృష్టి పెట్టి ముందస్తు హెచ్చరికలు చేసివుంటే..ప్రజలను సరుక్షిత ప్రాంతాలకు తరలించివుంటే నష్టం తగ్గించగలిగే వారు. ఇప్పటికైనా ఆపన్నులను ఆదుకోవాలి. సర్వం కోల్పోయిన వారికి వంటసామాన్లు సహా అన్ని కొని ఇవ్వాలి. రైతులను ఆదుకోవాలి.తడిసిన ధన్యం వెంటనే కొనుగోలు చేయాలి.

## వర్షాలతో అంటువ్యాధులు రాకుండా చర్యలు

ఇటీవలి వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ఎపిడమిక్ సెల్, రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని నల్గొండ జిల్లావైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డివిజన్ల వారీగా జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులకు సెలవులు రద్దు చేశామని, అత్యవసర సేవలు అందించేందుకు పాము, తేలుకాటుకు సంబంధించిన ఔషధాలు సిద్ధంగా ఉంచామన్నారు. డెంగీ, జ్వరాలు రాకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు జిల్లాసుపత్రుల్లో రోగులు చికిత్స కోసం వచ్చినా తగిన ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువగా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అంటువ్యాధులతో పాటు పదుల సంఖ్యలో రైతులు పాము, తేలుకాటుకు గురైనవారు ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. పల్లె, బస్తీ దవాఖానాల్లోని వైద్యులకు నవంబరు 3 వరకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు రద్దు చేశారు. ఇకపోతే మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని రహదారులు ఛిద్రమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా .. శిథిలమైన పాత భవనాలు, ఇళు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా సూర్యాపేట- వరంగల్ ప్రధాన రహదారిపై నెమ్మికల్ వద్ద రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అధికారులు చివ్వెంల-ఏపూరు మీదుగా ఖమ్మం రోడ్- వరంగల్‌కు భారీ, చిన్నతరహా వాహనాలను మళ్లించారు. చింతలపాలెం-దొండపాడు వద్ద 100 మీటర్ల వరకు రహదారిపై కోత పడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. యాదాద్రి జిల్లాలోని రుద్రవెల్లి- జూలూరు, బొల్లేపల్లి-సంగెం గ్రామాల మధ్య వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేశారు.




నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని 12 గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు జిల్లాల్లో 30 ఇళ్లు పూర్తిగా, 53 ఇళ్లు పాక్షికంగా నేలకూలాయని కలెక్టరేట్‌లోని విపత్తు, స్పందనల శాఖలోని కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 ప్రాంతాల్లో 13.46 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. 25 చోట్ల రహదారులపై అంతరాయం ఏర్పడింది. మొత్తం రూ.70.46 లక్షల నిధులతో మరమ్మతులు చేసేందుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు తాత్కాలిక అంచనాలు ప్రతిపాదించి.. శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.20.8 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

# ఉమ్మడి నిజామాబాద్ రైతులపై దెబ్బ

ఉమ్మడి నిజామాబాద్ ప్రజలు, రైతులు మొంథా తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. వరుసగా ఇది రెండోసారి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు కుదేలయ్యారు. ఉమ్మడి జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి పోవడం ఒక ఎత్తయితే, కోయకుండా పొలాల్లో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న మొత్తం నీటిపాల య్యింది. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోగా పలుచోట్ల తడిసి ముద్దయ్యింది. కొన్నిచోట్ల ఆరబెట్టి కొనుగోలుకు సిద్ధం చేసిన ధాన్యం భారీ వర్షాలకు పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయి. వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. కొందరు రైతులు చేసేదేమిలేక ఆరబెట్టిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందేమో అన్న ఆరాటంతో కంట తడిపెడుతున్నారు. డిచ్‌పల్లి, బోధన్, ధర్పల్లి, లింగంపేట, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వడ్ల కుప్పల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించడానికి కేంద్రానికి తీసుకువచ్చి ఆరబెడితే వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కోతకు వచ్చిన ధాన్యం రాలిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంలో తడవకుండా ఉండడానికి నానా తంటాలు పడ్డారు. తడిసిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక పోవడంతోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం తడవకుండా అధికారులు వెంటనే టార్పాలిన్లు అందించివుంటే నష్టం ఇంతగా ఉండేది కాదన్నారు. ధాన్యం రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే అవకాశం ఉన్నదని, అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకుందామంటే మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించింది. చేతికి వచ్చిన పంట వర్షార్పణం కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తున్నా సొసైటీ సిబ్బంది టార్పాలిన్లు ఇవ్వడంలేదని ఆగ్రహించిన అన్నదాతలు ఆందోళన చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలో సహకార సంఘం గోదాం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కోటగిరి-పొతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సొసైటీ సిబ్బంది తీరుపై నిరసన వ్యక్తంచేశారు. సహకార సంఘం సిబ్బంది చిన్న



రైతులను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికే ధాన్యం విక్రయించుకున్న పెద్ద రైతులకు అవసరం లేకున్నా టార్పాలిన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్న రైతులకు చెందిన ధాన్యం వర్షాలకు తడిసి, మొలకలు వస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా కురుస్తోన్న వానలతో రైతు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వానాకాలం సీజన్ ముగిసినప్పటికీ వానలు వీడక పోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేతికి వచ్చిన పంటను కోయలేక అనుకూల వాతావరణం కోసం ఎదురు

చూస్తున్నారు. వరి కోసిన రైతులంతా తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై పాట్లు పడుతున్నారు. పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే సిబ్బంది నిర్వాకంతో ధాన్యం వర్షానికి తడిసి పోతోంది. టార్ఫలిన్ కవర్లు సరిపడా అందుబాటులో పెట్టకపోవడంతో సమస్య ఎదురవుతోందని వాపోతున్నారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టు కునేందుకు కల్లాలు లేకపోవడంతో చాలా మంది రోడ్లపై కుప్పలు పోస్తున్నారు. ఆకస్మికంగా కురిసే వానలతో ధాన్యం తడిసి పనికి రాకుండా పోతోంది. తేమ శాతం పేరుతో కేంద్రాల్లో కొనుగోళ్లకు ససేమిరా అంటుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కొనుగోళ్లు జరిగినప్పటికీ ట్యాబ్ ఎంట్రీ సరిగా లేకపోవడంతో నిజామాబాద్ జిల్లాలో రూ.170కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉన్నది. కామారెడ్డి జిల్లాలో రూ.30కోట్లు మేర పెండింగ్ ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.275కోటు విలువ చేసే 1.15లక్షల మెట్రిక్ టన్నులు మేర ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6552 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.08లక్షలు సన్న రకం ధాన్యం ఉంది. 704 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 657 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. 354 సెంటర్లకు ధాన్యం రాక మొదలవ్వగా కొనుగోలు షురూ అయ్యా యి. 3218 మంది రైతులకు రూ.100కోట్లు చెల్లింపులు పూర్తయ్యాయి. మిగిలిన ధాన్యానికి చెల్లింపులు జరగాలంటే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి. పీఏసీఎస్, ఐకేపీ సెంటర్లలో సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా నమోదు ప్రక్రియ సత్వరం జరగడం లేదు. ఫలితంగా రైతుకు కనీస మద్ధతు ధర జమ కావడానికి జాప్యం జరుగుతోంది. కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 2,500 మంది రైతుల నుంచి 20వేల మెట్రిక్ టన్నులు వరకు ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6వేల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, మిగిలినది సన్న రకం ధాన్యం ఉంది. 190 ఐకేపీ, 233 పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం 124 చోట్ల కొనుగోళ్ల సందడి నెలకొన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కామారెడ్డిలో రూ.40కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.12కోట్లు మేర కనీస మద్ధతు ధరకు చెల్లింపులు పూర్తి చేశారు.

# తెలంగాణ రైతులపై మొంథా దెబ్బ

మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. అలాగే పలుచోట్ల పంటలు నీట మునిగాయి. గోడదెబ్బ చెంపదెబ్బలా రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వానికి అందిన వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.పంజా విసిరిన మొంథా తుఫాన్ దాటికి తల్లడిల్లుతున్న అన్నదాతలను, నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ప్రజలు అర్థిస్తున్నారు. మూడు, నాలుగు నెలలు కష్టపడి పెంచి పెద్ద చేసిన పొలాలు చేతికందే దశలో ఒక్క వర్షం అతలాకుతలం చేసింది. రెండు మూడు రోజుల్లో వరి కోయడానికి సిద్ధంగా ఉన్న రైతులను తుఫాను నిండా ముంచింది. కురిసిన భారీ వర్షంతో పొలాలు కింద పడిపోయి మడికట్లలో నీళ్లు నిలిచిపోయి గొలుసు మొత్తం వాలిపోయింది. ఎక్కడో చోట తప్ప దాదాపు అన్ని పొలాలు నేలవాలాయి. వరి కోయని రైతుల పరిస్థితి ఒకలా ఉంటే కోసిన రైతుల కన్నీటి వ్యధ మరో తీరు ఉన్నది. అమ్ముకునేందుకు కళ్ళాల్లో పోసి ఆరబోసిన తరుణంలో వర్షం రావడంతో తడిసి ముద్దయిపోయాయి. వర్షం వస్తుందన్న సమాచారంతో రాశులుగా పోసినప్పటికీ భారీ వర్షానికి తడిసి పోయాయి. మరోవైపు కల్లాల నుంచి నీళ్లు బయటకు పోలేని పరిస్థితుల్లో పూర్తిగా నీటిమట్ట మయ్యాయి. భారీ వర్షాలకు కుంటలు, వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కల్వర్టులు ఉప్పొంగడంతో ఎక్కడి వారు అక్కడే నిలిచి పోయారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో పంట నష్టం చోటు చేసుకోగా, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోనూ రైతులు భారీగా నష్టపోయారు. తుఫాను కారణంగా ప్రధానంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో మిరప, వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మొంథా తుఫాను ఎఫెక్ట్ తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు.

దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు,కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. మొంథా తూఫాన్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం పై పంజా విసిరింది. రాష్ట్రం లోనే అత్యధికంగా బుధవారం 41.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో భీమదేవరపల్లి మండలంలోని చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దాదాపు గ్రామాల్లోని అన్ని చెరువులు, కుంటలు నిండుకు న్నాయి. దశాబ్దాల క్రితం వరకు కూడా ముత్తారం చెరువు నిండ లేదని, ఇప్పుడే చెరువు నిండి మత్తడి పోస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.కొత్తపల్లిలో చెరువు తెగడంతో పోలీసులు, అధికారులు సహాయ సహకారాలు అందించారు. కాగా కొత్తకొండ చెరువు పెద్ద ఎత్తున మత్తడి పోయడంతో, చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. చేతికొచ్చిన మరి పంట నీట మునిగిందని, కోసిన వరి ధాన్యం తడిసి ముద్దయిందని చాలా చోట్ల రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మండలంలో సుమారు రెవెన్యూ అధికారులు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. తుఫాన్ దాటికి మండలంలో రెండు ట్రాన్స్‌పార్మర్స్, 26 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొప్పూరులో ఒక ఆవు, రెండు దూడలు, మల్లారం గ్రామంలో రెండు ఆవులు మృతి చెందాయి. మండలంలోని 94 చెరువులు, కుంటలు ప్రమాదంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో కుంట కింద ఏర్పాటు చేసిన వెంచర్ వల్ల రైతుల పంట పొలాలు నీట మునిగాయి. వెంచర్ ఏర్పాటు చేసిన తర్వాత కుంట మత్తడి వెళ్లేందుకు చిన్న మోరీ లాగా ఏర్పాటు చేశారు.



6030 ఎకరాలు వరి పంట దెబ్బతిందని, 3290 మంది రైతులు రోడ్డున పడ్డారని వ్యవసాయ అధికారుల అంచనా. కొత్తకొండ గట్లనర్సింగాపూర్, కొత్తకొండ మల్లారం గ్రామాల్లో ప్రధాన రహదారులు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యాభై ఏండ్ల తరువాత ఇంత స్థాయిలో వర్షం పడిందని స్థానికులు చెబుతున్నారు. బొల్లోనిపల్లి గ్రామం జలదిగ్బంధంలో ఉంది. దాదాపు 25 కుటుంబాల్లో ఇళ్లలోకి నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ప్రమాదం ఏర్పడింది. దీంతో పోలీసులు, అయితే బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరద వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో సమీప పొలాలన్నీ మునిగిపోయాయి. దీంతో తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపూర్ నుంచి పోరండ్ల, వచ్చునూర్ నుంచి జోగుండ్ల, పోలంపల్లి నుంచి మొగిలిపాలెం వెళ్లే రోడ్లలో వచ్చే వరద కల్వర్టుల వద్ద భారీగా వస్తున్నడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో హై లెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వరదలతో పూర్తిగా కొట్టుకుపోయిన సరుకు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథగా ఉంది.చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులం దరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి




సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది. నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మొంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగి పోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండా పోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వ పాలసీ అంశాలపై చర్చ

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితో**
**మహారాష్ట్ర ఐటీ, సినిమాటోగ్రఫీ మంత్రి ఆశిష్ శెలార్ భేటీ**

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం): రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితో మహారాష్ట్ర ఐటీ, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి ఆశిష్ శెలార్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో శుక్రవారం భేటీ అయ్యారు. సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలసీ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా నిర్మాణ రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించిందని, రాచకొండ లాంటి ప్రాంతాలు సినిమా షూటింగ్స్ కు ఎంతో అనువైనవి మహా రాష్ట్ర మంత్రికి వివరించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించిన రామోజీ ఫిలిం సిటీలో బాలీవుడ్, హాలీవుడ్ స్థాయి సినిమాలు నిర్మిస్తారని, హైదరాబాద్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న టూరిజం ప్రాంతాలు సినిమాలు నిర్మించేందుకు ఉత్తమ వేదికలుగా తీర్చిదిద్దుతున్నామని మహా రాష్ట్ర మంత్రితో అన్నారు.

తెలంగాణను హాలీవుడ్ స్థాయి ఫిల్మ్ హబ్‌గా డెవలప్మెంట్ చేస్తున్నామని మంత్రి వివరించారు. సినిమా పరిశ్రమకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు, సినీకార్మికుల సంక్షేమం లాంటి ప్రోత్సాహక కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. సినిమా పరిశ్రమ



అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని, మహా రాష్ట్రలో కూడా ఇట్లాంటివి అమలు చేసేందుకు తెలంగాణ పర్యటనకు వచ్చినట్టు మహా రాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్ వివరించారు. మహారాష్ట్ర ఫిల్మ్ సిటీని విజిట్ చేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

# జీడీపీ అంటే 'గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్'

- **మూల స్థంభాలుగా అర్బన్ ఇంజిన్, ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ్, రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్**
- **కీలక పారిశ్రామిక కారిడార్ గా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం**
- **'మేక్-ఇన్-సౌత్, స్కేల్-ఫర్-ది-వరల్డ్' కోసం కలిసి పని చేద్దాం**
- **'సీఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్' సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**

హైదరాబాద్: మా ప్రభుత్వం దృష్టిలో 'జీడీపీ' అంటే కేవలం 'గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్' కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్(జీఈపీ) అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ '15' ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక భాగస్వామిగా మార్చుతామన్నారు. శుక్రవారం బేగంపేట్‌లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్



ఇన్నోవేషన్‌బీ తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు.

'అర్బన్ ఇంజిన్', 'ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ్', 'రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్' అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఇందుకోసం అమలులో వేగం, అవకాశాలలో పారదర్శకత, రూపకల్పనలో 'ఫ్యూచర్-రెడీ'గా ఉండే కొత్త అభివృద్ధి నమూనాకు 'రోడ్‌మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు చేరేలా సర్వీసెస్, సస్టైనబిలిటీ, స్మార్ట్ లివింగ్ కు గ్లోబల్ క్యాపిటల్, నెట్-




జీరో ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని గ్లోబల్ 'చైనా ం 1' అవకాశాన్ని అందిపుచ్చుకునేలా కీలకమైన పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రతి రైతును పారిశ్రామికవేత్తగా మార్చేలా అగ్రి-ప్రాసెసింగ్ క్లస్టర్లు, డిజిటల్-అనుసంధానం కలిగిన ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ, ఇమేజ్ టవర్స్, టీ-హబ్ ఫేజ్ 2 ద్వారా రాష్ట్రంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ మరింత పటిష్ఠమవుతుందన్నారు. రాష్ట్రంలో 2030 నాటికి '20 గిగావాట్స్' పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమ వాటితో పోటీపడేలా 'మేక్-ఇన్-సౌత్, స్కేల్-ఫర్-ది-వరల్డ్' ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు దక్షిణాది రాష్ట్రాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. 'విశ్వసనీయమైన లాంచ్ ప్యాడ్'గా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఏపీ తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గిరిజన క్రీడాకారులు రాణించాలి

**- గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ చరిత్ర సృష్టించింది**
**- సమగ్ర క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**- మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి**

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం): దేశంలోని తొలి జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్ 2025లో తెలంగాణకు విజేతగా గౌరవం దక్కింది. దేశంలో తొలిసారిగా నిర్వహించిన జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్ 2025లో తెలంగాణ చరిత్ర సృష్టించింది. 30 బంగారు, 40 వెండి, 18 కాంస్య పతకాలు సాధించి విజేతగా నిలిచింది. అస్సాం రాష్ట్రం రన్నరప్‌గా నిలిచింది.

అక్టోబర్ 28 నుండి 30 వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్ లో జరిగిన మూడు రోజుల పోటీలు గిరిజన క్రీడా రంగంలో కొత్త మైలురాయిగా నిలిచాయి. గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీని గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించాయి. దేశంలోని 10 రాష్ట్రాల క్రీడాకారులు 200 మీటర్లు మరియు 500 మీటర్ల దూరంలో పురుషులు, మహిళలు, 16 ఏళ్లలోపు, 16 ఏళ్ళు పైబడిన వయసు విభాగాల్లో కానోయ్ కయాక్ విభాగాలలో పోటీ పడ్డారు.

ఈ ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై విజేతలను అభినందించారు. క్రీడాకారుల క్రమశిక్షణ, కృషి, పట్టుదల ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతూ దేశంలో తొలి జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్‌షిప్ కి ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ఇది సమగ్ర క్రీడాభివృద్ధికి రాష్ట్రం కట్టుబడి ఉన్నదనడానికి నిదర్శనం అని కొనియాడారు.

గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. గిరిజన యువతను క్రీడల ద్వారా శక్తివంతం చేయడంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ చేసిన కృషిని ప్రశంసించారు. విజేతలు, పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకి బహుమతులను, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. వి. సముజ్వాలా డైరెక్టర్, సర్వేష్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, కోటాజీ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, రామకృష్ణ, కోచ్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క హామీనీ అమలు చేయని కాంగ్రెస్!

**- బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం నాయకులు**
**- ఎంఐఎం నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్**

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం): రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంఐఎం నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ.. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఫైరయ్యారు.

ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. అయితే.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలని అన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. పేదల ఇళ్ళు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని కేటీఆర్ ధైర్యం చెప్పారు. ప్రజలకు తాము ఎప్పటికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని సీసీఐ అధికారులను కోరా...

**కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా**

హైదరాబాద్ :రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మేలసంగం లోని కాటన్ మిల్ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ .. పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు.

రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ను కల్పించాలని సీసీఐ అధికారులను మంత్రి కోరారు. దళారులను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా సదాశివ పేట, రాయికోడ్, నారాయణ ఖేడ్, జోగిపేట, వాట్పల్లి మండలాల పత్తి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం 'కపాస్ కిసాన్ 'మొబైల్ యాప్ ను డౌన్ లోన్ చేసుకోవాలని సీసీఐ అధికారులు కోరారు. గత వర్షాకాలం (2024-25) లో 3 లక్షల 80 వేల క్వింటాల్ల పత్తిని కోనుగోలు చేసి రైతులకు 280 కోట్ల రూపాయలను చెల్లించామని సీసీఐ అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహాకి వివరించారు. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని



మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా రైతులకు జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఐ సీనియర్ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.





# చితికిపోయిన చిన్న కారు రైతు

**- కొనుగోళ్ల కోసం బ్యాంకు నుంచి అప్పు తీసుకుంటే దాని వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుంది**
**- మరి రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనడంలో ఎందుకు ఆలస్యం చేస్తోంది?**
**- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు**

నల్లగొండ: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు మార్కెట్ యార్డుల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, చిట్యాలలో కొనుగోలు కేంద్రాలకు వెళ్లారు. అక్కడి రైతులతో వర్షాల ప్రభావం, పంటల నష్టాలు, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల విషయంలో అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి వంటి విషయాల గురించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులు భారీ వర్షాలకు తమ పంటధాన్యం తడిసిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలం ఏర్పాటు చేయలేదని, తమ రెక్కల కష్టం నీటిపాలైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాం చందర్ రావు మీడియాతో ఏం మాట్లాడారంటే.. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో పంట నష్టాల పరిస్థితిని తెలుసుకునేందుకు, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, బాధిత రైతులకు అండగా నిలిచేలా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మూడు బృందాలను వివిధ జిల్లాలకు పంపడం జరిగింది.

రైతులు పంటలు నష్టపోయాయని, తమ ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ధాన్యంలోని తేమను ఆర్పే మిషన్లు, నిల్వ సదుపాయాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చిన్నకారు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ధాన్యం కొనుగోలును ఆలస్యం చేస్తున్నారు. ట్రాన్స్పోర్టు, బస్తాలు, బస్తా సుతిల్, హమాలి చార్జీలు ఇలా మొత్తం కేంద్రమే రాష్ట్రానికి చెల్లిస్తుంది. సివిల్ సప్లయ్స్ డిపార్ట్ మెంట్ సహా ఐకేపీ వారికి కూడా కేంద్రమే కమిషన్ ఇస్తున్నది. రాష్ట్ర సర్కారు కొనుగోళ్ల కోసం ఒకవేళ బ్యాంకు నుంచి అప్పు తీసుకుంటే దాని వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుంది. మరి రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనడంలో ఎందుకు ఆలస్యం చేస్తోంది?

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (%మీూ%)కు ధాన్యం కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి. రైస్ మిల్లర్లు, కాంగ్రెస్ నాయకుల మధ్య జరుగుతున్న దళారీ వ్యాపారాన్ని వెంటనే ఆపాలి. అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు టార్పాలిన్లు, తేమ ఆర్పే మిషన్లు, నిల్వ సదుపాయాలు తక్షణమే కల్పించాలి.

# చంద్రబాబును చూసి నేర్చుకో

**తుఫాన్ సమయంలో ఇలాగేన వ్యవహరించేది**
**గతంలో ఇస్తామన్న సాయం ఎందుకు ఇవ్వలేదు**
**మైనార్టీ ఓట్లకోసమే అజార్‌కు పదవి**
**అజారుద్దీన్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు నిజం కాదా**
**బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు**

హైదరాబాద్,అక్టోబర్31(అక్షర గళం): తెలంగాణ రాష్ట్రమంతా మొంథా తుఫాన్‌లో అల్లకల్లోలం అవుతోందని.. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏం చర్యలు చేపట్టారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మొంథా తుఫాన్ చర్యలపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఏప్రిల్, మేలో కూడా అకాల వర్షాలు కురిశాయని.. ఆ సమయంలో పంట నష్టం జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని చెప్పారని.. ఇంకా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. కేవలం పేపర్ స్టేట్‌మెంట్ మాత్రమే ఇస్తున్నారని.. ఆచరణలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తుఫాను, వర్షం తదితర విపత్కర పరిస్థితులపై అధికారులతో లెక్కలు తెప్పించుకోవడం.. తర్వాత గాలికి వదిలేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక.. ఎన్ని ఎకరాలకు పరిహారం ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలని, రైతులని ఆదుకోవాలనే ఆలోచన రేవంత్‌రెడ్డికి లేదని ÷ర్ అయ్యారు. తడిసిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంత దుర్మార్గమైన పాలన జరుగుతుందో ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మొసలి కన్నీళ్లు కార్చి.. గాలి మోటార్లలో సీఎం రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారని ఆక్షేపించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప



ఎన్నికలో మైనార్టీ ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్న ఆటని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని.. ఆయనతో మంత్రిగా ఎలా ప్రమాణ స్వీకారం చేయించారని ప్రశ్నల వర్షం కురిపించారు. గో సంరక్షకులను తుపాకీతో కాలిస్తే ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. సీఎం వెనుక మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారని ఆరోపించారు. అసదుద్దీన్ డి ఫాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్, మజ్లిస్ ఆడుతున్న నాటకాలని ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు రాజ్యాంగాన్ని ఇద్దరే చదివినట్లున్నారని విమర్శించారు. ఒక వర్గం మెప్పు కోసం కాంగ్రెస్ చేసే ప్రయత్నం చట్ట వ్యతిరేకమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌కి మజ్లిస్ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని నిలదీశారు. అజారుద్దీన్‌కి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాకముందే మంత్రి పదవిని అసదుద్దీన్ ఇప్పించుకున్నారని విమర్శించారు. హిందువులను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీ నేతలకి పట్టం కడుతున్నారని ర్ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో హిందువులే కాంగ్రెస్‌కి దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వబోతున్నారని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

# సీఎం ప్రజావాణిలో 193 దరఖాస్తులు

**- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**

హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 193 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 42, రెవెన్యూ శాఖకు సంబంధించి 33, ఇందిరమ్మ ఇండ్ల కోసం 75, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 40 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



# అమితాబ్‌కు బెదిరింపులు

**భారీగా భద్రత పెంచిన కేంద్రం**

ముంబై,అక్టోబర్31(అక్షర గళం): బాలీవుడ్ బిగ్ బీ అమితా బచ్చన్ కు కేంద్ర భారీగా భద్రత పెంచనుంది. ఇటీవల పంజాబీ సింగర్, నటుడు దిల్జిత్ దోసాంజ్ ' కౌన్ బనేగా కోరోడ్ పతి' ఎపిసోడ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నా డు. ఇది వివాదానికి దారి తీసింది. ఈ క్రమంలో అమితాబ్ కు బెదిరింపులు వచ్చాయి. బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడాన్ని ఖలిస్తానీ సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్' (÷ూఈఎ) తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సంస్థ అధిపతి గురుపత్వంత్ సింగ్ పన్నూ, అమితాబ్‌ను గౌరవించడం అనేది 1984 సిక్కు వ్యతిరేక హింసలో చనిపోయిన వారిని అవమానించడమేనని ఆరోపించారు. అంతేకాకుండా, 1984 అల్లర్లను రెచ్చగొట్టడంలో అమితాబ్ కీలకపాత్ర పోషించారని, ఆయన అప్పుడు 'ఖూన్ కా బద్లా ఖూన్' అనే నినాదాన్ని ఇచ్చారని ÷ూఈఎ ఆరోపిస్తోంది. అయితే, బిగ్ బీ గతంలోనే ఈ ఆరోపణలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో,ఖలిస్తాన్ చీఫ్ పన్నూ, నవంబర్ 1న ఆస్ట్రేలియాలో జరగనున్న దిల్జిత్ దోసాంజ్ మ్యూజిక్ కచేరీని అడ్డుకుంటామని బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశాడు. ఈ బెదిరింపులు దిల్జిత్ అభిమానుల్లో, అలాగే చిత్ర పరిశ్రమలో ఆందోళన కలిగించాయి. ఉగ్రవాద సంస్థ నుంచి వచ్చిన ఈ బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.



# కొత్త అనుభూతిని పంచిన బాహుబలి..ది ఎపిక్

'బాహుబలి' సినిమాల్లో కథ అందరికీ తెలిసిందే. ఈసారి కథ కంటే కూడా మహిష్మతి ప్రపంచాన్ని మరోసారి పెద్ద తెరపై చూడటానికీ, రెండు భాగాలు కలిపి చూసినప్పుడు పాత్రలు పంచే ఆ అనుభూతి ఎలా ఉంటుందో అస్వాదించడానికీ వెళతారు ప్రేక్షకులు. అయితే కథ తెలిసినవాళ్లకయినా.. తెలియని వాళ్లకైనా సరే 'బాహుబలి : ది ఎపిక్' ఓ కొత్త సినిమా చూసిన అనుభూతిని పంచుతుంది. అందరినీ మరోసారి మాహిష్మతి ప్రపంచంలో లీనం చేసి, పాత్రలతో కలిసి ప్రయాణం చేయించారు దర్శకుడు రాజమౌళి. అలాగని ఇందులో కొత్త సన్నివేశాలేమీ జోడించలేదు. ఒకట్రెండు డైలాగులు తప్ప అదనంగా ఏమీ ఉండవు. రాజమౌళి తెరపై చూపించిన మాహిష్మతి రాజ్యాన్ని దాని పాలనకు సంబంధించిన రెండు పార్ట్‌లను కలిపి ఒక్కటిగా చూపారు. ఇప్పుడు ఆ రెండు భాగాల్ని కలిపి చూస్తున్నప్పుడు.. ఒకవైపు థ్రిల్ చేసే హీరోయిక్ హై మూమెంట్స్, మరోవైపు కథలోని భావోద్వేగాలు మనసుల్ని కట్టిపడేస్తూ ఎపిక్ అనుభవాన్ని పంచుతుంది. సినిమాని కొత్తగా ఎడిట్ చేసినా.. స్క్రీన్‌ప్లేలో మార్పులేమీ లేవు. తొలి భాగం సినిమాని ప్రథమార్థంలోనూ, రెండో సినిమాని ద్వితీయార్థంలోనూ చూపించారు. ప్రథమార్ధంలో పచ్చబొట్టేసినా పాటతోపాటు, శివుడు, అవంతిక పాత్రల మధ్య లవ్ ట్రాక్‌కి కోత పెట్టారు. ఆ ఎపిసోడ్ కథనంతా రాజమౌళి తన వాయిస్ ఓవర్‌తో చెప్పేశారు. ఆ తర్వాత కీలక సన్నివేశాల్ని చూపిస్తూ కథని వేగంగా చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ప్రథమార్ధంలో యుద్ధం ఎపిసోడ్స్‌నీ కొంచెం కుదించి చూపించారు. దాంతో అవి మరింత పదునుగా అనిపిస్తాయి. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో తెలుసుకునేందుకు ఇప్పుడు రెండేళ్లు ఎదురు చూడాల్సిన అవసరం లేదని సూచిస్తూ తొలి భాగాన్ని ముగించారు.

'బాహుబలి: ది కన్‌క్లూజన్' కథతో ద్వితీయార్ధాన్ని భావోద్వేగ భరితంగా చూపించి ప్రేక్షకులను మరోసారి కట్టిపడేశారు. ప్రతి ఎపిసోడ్ హైలెట్‌గా నిలుస్తుంది. రెండు భాగాల్లో తొంభై నిమిషాలకుపైగా సన్నివేశాలను తొలగించినా ఆ ప్రభావం సినిమాపై పెద్దగా కనిపించనివ్వకపోవడం విశేషం. ఒక సినిమాలో అమాంతం సన్నివేశాలు మారినప్పుడు సంగీతం పరంగానూ, విజువల్ కోణంలోనూ సమస్యలొస్తుంటాయి. ఆ విషయాలపై ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని రీవర్క్ చేసినట్టు అనిపిస్తుంది. చాలా రోజుల తర్వాత పెద్ద తెరపైన ప్రభాస్ రాయల్ లుక్‌ని చూడటం అభిమానులకైతే ఓ పండగ అనుభవమే. ప్రభాస్ ని మళ్లీ అలాంటి డైనమిక్ లుక్‌లో, అంత హుషారుగా ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆశని, ఉత్సుకతని రేకెత్తిస్తుందీ చిత్రం. భల్లాలగా రానా దగ్గుబాటిని తప్ప మరొకరిని ఊహించుకోలేం అన్నట్టుగా ఆయన అభినయం మరోసారి మైమరిపిస్తుంది. కీరవాణి సమకూర్చిన సంగీతం కొత్త హంగుల్ని అద్దుకుని మరింత కొత్తగా వినిపించింది. నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంది. మారిన సాంకేతికతకి అనుగుణంగా సంగీతం, విజువల్స్‌కు కొత్త హంగుల్ని సంతరించుకోవడం 'ది ఎపిక్'కి మరింతగా కలిసొచ్చింది. ఎడిటింగ్ బాగా కుదిరింది. రెండు భాగాలను కలిపి ఒక సినిమాగా తీసుకొచ్చే ఓ కొత్త దారిని 'బాహుబలి: ది ఎపిక్' చూపించింది.

## దర్శకుడు ప్రశాంత్ వర్మతో డీల్ చేసుకోలే: డివివి సంస్థ

దర్శకుడు ప్రశాంత్ వర్మకు తాము అడ్వాన్స్ ఇవ్వలేదని తెలుపుతూ ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పోస్ట్ పెట్టింది. ఇటీవల వరుస సినిమాలు ప్రకటించిన ప్రశాంత్ వర్మ.. వీటి కోసం కొన్ని నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆ నిర్మాణ సంస్థల జాబితాలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉండడంతో తాజాగా దీనిపై స్పందిస్తూ పోస్ట్ పెట్టింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఏ ప్రాజెక్ట్ కోసమూ అడ్వాన్స్ ఇవ్వలేదు. మాకు, దర్శకుడికి మధ్య వ్యాపార పరమైన ఒప్పందాలు జరగలేదు. ఏదైనా వార్తను ప్రచారం చేసేముందు అందులో నిజానిజాలు తెలుసుకోవాలని కోరుతున్నాం. ఇలాంటి వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అని నోట్ విడుదల చేసింది. తన సినిమాటిక్ యూనివర్స్‌కు సంబంధించి ప్రస్తుతం చాలా స్క్రిప్ట్‌లు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 'మహాకాళీ' , 'అధీర'లను ప్రకటించారు. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఒక సినిమా విడుదలవుతుందని ఆయన తెలిపారు.



## పెద్ది కొరియోగ్రాఫర్‌గా జానీమాస్టర్



మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొని గతంలో జైలు జీవితం గడిపిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రీఎంట్రీపై టాలీవుడ్‌లో పెద్ద దుమారం రేగుతోంది. ఆయన ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'కి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా అతడిని చిత్రబృందం నియమించడంపై నెట్టింట తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని, పోక్సో చట్టం కింద అరెస్ట్ అయిన వ్యక్తికి మళ్లీ సినీ పరిశ్రమలో పెద్ద హీరో సినిమాలో పనిచేసే అవకాశం ఎలా ఇస్తారంటూ నెటిజన్లు, సినీ వర్గాలు తీవ్ర స్థాయిలో ప్రశ్నిస్తున్నాయి. సినిమా అనేది సమాజంపై బలంగా ప్రభావం చూపే మాధ్యమం. అటువంటి మాధ్యమంలో మహిళలపై నేరాలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను తిరిగి తీసుకోవడం ద్వారా టాలీవుడ్ ఎలాంటి సందేశం ఇవ్వదలుచుకుందని పెద్ది చిత్ర బృందంని పలువురు నిలదీస్తున్నారు. రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలతో పాటు మైత్రీ మూవీ మేకర్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు నైతిక విలువలను మర్చిపోయి.. వివాదాస్పద వ్యక్తులకు పని కల్పించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. కేవలం ప్రతిభ ఉందనే కారణంతో తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొన్నవారిని ప్రోత్సహించడం సినీ పరిశ్రమ నైతికతను ప్రశ్నిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'పెద్ది' వంటి పాన్ ఇండియా ప్రాజెక్టులో జానీ మాస్టర్‌కు అవకాశం ఇవ్వడం, టాలీవుడ్ పరిశ్రమలో 'మీ టూ' ఉద్యమం స్ఫూర్తిని, మహిళా భద్రత పట్ల ఉన్న నిబద్ధతను నీరుగార్చిందని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## వేడుకగా నారా రోహిత్ వివాహం

### హాజరైన నారా చంద్రబాబు దంపతులు

టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ఓ ఇంటి వాడయ్యాడు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అతిరథ మహారాధుల సమక్షంలో ప్రేయసి శిరీష



మెడలో మూడు ముళ్ళు వేసాడు నారా రోహిత్. గతేడాది అక్టోబర్ లో నారా రోహిత్- శిరీష్‌ల నిశ్చితార్థం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి బంధంతో ఒక్కటి అయ్యారు. శిరీషా స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీష నటన పై మక్కువతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటించిన ప్రతినిధి-2 సినిమాలో రోహిత్ ప్రియురాలిగా నటించింది. అదే సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. అదే విషయాన్ని ఇంటి సభ్యులకు చెప్పారు. వారి అంగీకారంతో ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. కాగా ఈ వేడుకకు అటు రాజకీయ, సినీ ప్రముఖులు హాజర్యయారు. రోహిత్ వివాహ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి భువనేశ్వరి దగ్గరుండి అన్ని కార్యక్రమాలు నిర్వహించారు.

అలాగే నారాలోకేష్ దంపతులు, నందమూరి బాల కృష్ణ దంపతులు నూతన జంటను ఆశీర్వదించారు. యంగ్ హీరోలు మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస, శ్రీ విష్ణు ఈ వేడుకకు హాజరయి రోహిత్ దంపతులకు విషెష్ తెలిపారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ వేడకలో పాల్గొని వధూవరులను దీవించారు.



## నిరాడంబరంగా నటుడు అల్లు శిరీష్ నిశ్చితార్థం

నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. నయనికతో కలిసి ఏడడుగులు వేయనున్నారు. ఈ క్రమంలో వీరి నిశ్చితార్థం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాలతోపాటు కొద్దిమంది బంధువులు, సన్నిహితుల సమక్షంలో శిరీష్- నయనిక ఉంగరాలు మార్చుకున్నారు. చిరంజీవి, నాగబాబు, రామ్‌చరణ్, వరుణ్ తేజ్ తదితరులు తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి సందడి చేశారు. ఈ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలు సామాజికమాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

## కపూర్ ఫ్యామిలీపై డాక్యుమెంటరీ

బాలీవుడ్ స్టార్ కుటుంబం కపూర్ ఫ్యామిలీకి సంబంధించి నెట్‌ఫ్లిక్స్ వేదికగా డాక్యుమెంటరీ సిరీస్ రాబోతుంది. 'డైనింగ్ విత్ ది కపూర్స్' అనే పేరుతో రూపొందిన ఈ ఫ్యామిలీ డాక్యుమెంటరీ నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ డాక్యుమెంటరీలో కపూర్ కుటుంబానికి చెందిన అగ్ర నటులు రణ్‌బీర్ కపూర్, కరీనా కపూర్ ఖాన్ తదితర ప్రముఖులు తమ కుటుంబ అనుబంధాలు, జ్ఞాపకాలు, బాల్యం గురించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోనున్నారు. బాలీవుడ్ లెజెండ్ రాజ్ కపూర్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఈ కుటుంబంలోని ప్రస్తుత తరం స్టార్స్ జీవిత విశేషాలు అభిమానులకు ఆసక్తికరంగా మారనున్నాయి.




## అఖండ-2 కోసం థమన్ మాస్ థీమ్

నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అఖండ 2: తాండవం' చిత్రంపై భారీ అంచనాలు అంతకంతకు పెరుగుతూ ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్ చిత్రంపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పటికే థమన్ 'అఖండ' సినిమా మ్యూజిక్‌తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసి ఇప్పుడు 'అఖండ 2' కోసం మరింత పవర్‌ఫుల్, డివైన్ టోన్ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాటలు, సంగీతంపై దృష్టి పెట్టిన తమన్ శ్లోకాలు వల్లించడంలో ఉద్దండులైన వారిని రంగంలోకి దింపుతున్నాడు. ఇప్పటికే ఉత్తరాది నుంచి మిశ్రా బ్రదర్స్ ను తీసుకు రాగా తాజాగా సర్వేపల్లి సిస్టర్స్ ను తెర మీదకు తీసుకు వచ్చాడు. 'అఖండ 2: తాండవం' కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాలయ్య ఎంట్రీ సీన్స్ కోసం ప్రత్యేకమైన శివతాండవ రాగాల కలయికతో థమన్ ఒక ఆధ్యాత్మిక మాస్ థీమ్ రూపొందిస్తున్నారు. ఫ్యాన్స్ ఇప్పటికే థమన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన చిన్న సౌండ్ స్నిప్ వల్ల ఎగ్జైట్ అవుతున్నారు. బోయపాటి, బాలయ్య కాంబినేషన్ మరోసారి రికార్డులు తిరగరాయ బోతుందన్న నమ్మకం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ చెన్నై పరిసరాల్లో జరుగుతుండగా, మ్యూజిక్ మరియు బ్యాక్‌గ్రౌండ్ వర్క్ సమాంతరంగా సాగుతోంది.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154